# ఐఎన్‌డిఐఏ (ఇండియా) : పేరులో ఏముంది?

అలోక్ ముఖర్జీ

**ఒక** పేరులో ఏముందని కొందరు అనవచ్చు. అయితే హేతుప్రాసలు లేకుండా ఏదో ఒక పేరును ముందుకు తోయటం, ఇతరులంతా దానిని ఆమోదించటం... ఈ ప్రశ్నను ముందుకు తెస్తోంది. 'ఇండియా' ఒక గొప్పదేశంగా వుండటానికి బదులుగా, తమ పార్లమెంటరీ కాంక్షల బలివితర్దిపై మన ప్రియమైన దేశాన్ని వుంచటానికి కూడా సిగ్గుపడని స్వీయ కోర్కెల నాయకుల కూటమి పేరుగా మారిపోయింది. మోడీ ఫాశిస్టు తరహా పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రత్యేక కూటమి పోరాడుతుందని ప్రజలను నమ్మించేందుకు వారు ప్రయత్నిస్తున్నారు. ఈ కూటమి మోడీతో ఎక్కడ రాజకీయంగా విభేధిస్తుంది?! దీని గురించి చర్చించటానికి ఈ కూటమి సభ్య పార్టీలకు సమయము లేదు; అయితే, దీనిని ఏవిధంగా ఎగవేయాలనే దానిపై చర్చించటానికి మాత్రం తగినంత సమయముంది. కానీ, ఈ కూటమి పేరు తనకు తానుగానే ఎన్‌డిఏ నాయకత్వంలోని మోడీ-షాల సిద్ధాంత భావజాలానికే ప్రాతినిధ్యం వహిస్తున్నారని రుజువు చేస్తోంది.

ఈ కూటమి మోడీకి నిజమైన ప్రతిపక్షమే అయివుంటే, అది పేరులోనూ ప్రతిఫలించి వుండేది. ఆ పరిస్థితుల్లో అయితే, మొదట కూటమి కార్యక్రమమేమిటో చర్చించి వుండేవారు. అయితే వారు గుర్రాన్ని బండికి ముందు కట్టేశారు. కూటమిలోని పార్టీలన్నీ మోడీ పాలన ఫాశిస్టు లేదా నిరంకుశమైనదిగా పిలుస్తున్నారు. అప్పుడు నిరంకుశానికి లేదా ఫాశిజానికి వ్యతిరేకమైనది ఏమై వుండాలి? రాజకీయ పరిజ్ఞానమున్న ఎవరికైనా అది ప్రజాస్వామ్యమని తెలుసు. కూటమి పేరులో 'డి' అక్షరం వుంది; అయితే అది ప్రజాస్వామ్యాన్ని వుద్దేశించి కాదు. కానీ, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం అమెరికా ఏకాభిప్రాయంగా నిర్దేశించిన నయా ఉదారవాద సిద్ధాంత శబ్దమైన 'డెవలప్‌మెంటల్' అనే దానిని 'డి' సూచిస్తోంది. 'డెవలప్‌మెంట్' అని వల్లెవేసే ఈ పదం, మోడీ అండ్ కంపెనీ మంత్రంగా నిరంతరం జపిస్తూ వుండేదే. ఇక దీనిలో 'ఎన్' అనే అక్షరానికి 'నేషనల్'(జాతీయ) అనేవిధంగా పశ్చిమబెంగాల్ అధినేత్రి మమతా బెనర్జీ ఆలోచనల యొక్క కీలకాంశంగా జోడించారు.

మోడీ ఉపయోగిస్తున్న 'నేషనల్' అనే పదానికి, వీరు చెబుతున్న ఈ పదానికి అర్థంలో ఏమైనా తేడా వుందా? స్వావలంబనకు బదులుగా ఒక్కసారి నీవు 'డెవలప్‌మెంట్' అనే పదానికి ఆమోదం తెలిపితే, జాత్యహంకారం, యుద్ధోన్మాదాలను నిరంతరం మోసుకు తిరిగే మోడీ చెప్పే అర్థమే దీనికి కూడా వర్తిస్తుంది. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించటం వంటి ఇతర అంశాలు 'కూటమి' అర్థంలో వున్నాయా, వుంటే వాటిని ప్రకటించాలి.

మమతాబెనర్జీ మరో అస్పష్టమైన 'ఇన్‌క్లూసివ్' అనే పదాన్ని చేర్చింది. కూటమిగా చెప్పబడే దాని విశేషణంగా దీనిని ఉపయోగించారని, 'డెవలప్‌మెంటల్' అనే పదాన్ని కాదని ప్రతి ఒక్కరూ స్పష్టంగా వుండాలి. కావున 'డెవలప్‌మెంటల్' కార్యకలాపాలు 'ఇన్‌క్లూసివ్'గా (సమ్మిళితంగా) వుంటాయనేది దీని అర్థం. ఏమైనా, ఐఎంఎఫ్-వరల్డ్‌బ్యాంక్-డబ్ల్యుటిఓల త్రయం నుండి అరువు తెచ్చుకున్న పదమే అది. ప్రజలను మోసగించటానికి, గుత్త కంపెనీల ప్రయోజనాలకు సేవజేసేందుకు తరచుగా ఈ త్రయం 'హోలిస్టిక్' (సమగ్రాకృతి), 'ఇన్‌క్లూసివ్' (సమ్మిళిత) వంటి పదాలను ఉపయోగిస్తుంది. ఏమైనా, ఇక్కడ కూటమికి విశేషణంగా 'ఇన్‌క్లూసివ్'ను ఉపయోగించటమంటే అర్థం, అదానీ, అంబానీ, అలాగే ఇతరులను కూడా వర్గ సమూహాలుగా కాకుండా, రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం వహించే వారిగా గుర్తింపుతో చేర్చుకోవాలనేదే! పీడిత ప్రజల ప్రయోజనాలు చాలా ప్రాముఖ్యం కల్గినవనేది నిజం. అయితే పీడిత వర్గాలకు వ్యతిరేకులుగా అయితే మాత్రం కాదు. దీనిని బరితెగించి, తెలివిగా చేసుకోవాలి; ఎందుచేతనంటే అంబానీ, అదానీ వంటి వారు, కార్మికులు, పేద ప్రజానీకం కలగలవటమే దీని అర్థమైతే అదొక నవ్వులాట వ్యవహారంగా మిగిలిపోతుంది. వాస్తవానికి 'ఇన్‌క్లూసివ్' అంటే అర్థం-అదానీ, అంబానీ మరియు వారి తరహా వారి ప్రయోజనాలన్నీ 'ఇన్‌క్లూడ్' చేసుకోవాలనేదే!

మొత్తంమీద ఇది భారత ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పడిన కూటమి కాదు; అయితే ఫాశిస్టు/నిరంకుశ మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజల మనోవేదన, ఆగ్రహాలను కొందరు అవకాశవాద నాయకులు తమ పదవీ కాంక్ష కోసం ఉపయోగించుకునేదే! 'ఇండియా' కూటమి నయా ఉదారవాదం విషయంలో ఎక్కడ నిలబడుతుంది? హిందూ మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడటంలో వారు ఎక్కడ నిలుస్తారు, నూతన కార్మిక కోడ్‌లపై వారి వైఖరి ఏమిటి, పొరుగు దేశాలతో శాంతియుత సహజీవనం స్థానంలో, జాతీయవాద దురహంకారం పెంచిన యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకించటంలో వీరు ఎక్కడ నిలబడతారు? అక్కడ అన్నీ ప్రశ్నలు, ప్రశ్నలే! మోడీ ప్రభావశీలంగా తన కార్యాచరణను అమలు చేస్తున్నాడు. అభివృద్ధి, జాతీయవాదం, విదేశాంగ విధానాలపై, మోడీ పాలనపై అత్యధిక నాయకులు కూడా ఒకే అభిప్రాయం కలిగి బడా బూర్జువావర్గపు అత్యంత ప్రచండ శక్తులను పూర్తి ఆధిపత్యంతో పాలనకు అనుమతించటం కోసమేనని అభిప్రాయపడుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే 'ఇండియా'గా పిలవబడే ఈ కూటమి దేశ ప్రజలకు నమ్మక ద్రోహం చేసింది.